## మినీకథ

"ఏం చెప్పమంటావు మంగా మావార్ని ఆ సుజాత బుట్టలో వేసుకుంది. ఇంతకు ముందు నాకు తెలీకుండా పోతూండే వారు దానదగ్గరకి. ఇప్పుడదేం లేదు. నాదగ్గర కూడా దానిగొడవే నేను చేసిన ప్రతి పనినీ అసహ్యించుకోవడం, పైగా- దాన్ని చూసి బుద్ధితెచ్చుకోమనడం. ఇంక ఈ యుగంలో ఆయన మారతారని నాకు ఆశ లేదు." అంది సావిత్రి ప్రక్కింటి మంగ తాయారుతో కొంగుతో కళ్ళొత్తుకుంటూ.

మంగతాయారు గబుక్కున సావిత్రి చేతిమీదకొట్టి, వెనక్కి చూపించింది. ఉలిక్కిపడి, అటు చూసింది సావిత్రి.



"ఒకసారి లోపలికొస్తావా సావిత్రీ" చిరునవ్వుతో పిలిచి, లోపలికెళ్ళాడు సుబ్బారావు.

సావిత్రి ఆశ్చర్యానికి అవధులు లేవు. భర్త నవ్వు మొహంచూసి ఎన్నాళ్ళయిందో! పైగా ఎంత సాదరంగాపిలిచాడు. చేతిలో ఏదో ప్యాకెట్టుకూడావుంది. గబగబా లేచి, లోపలకి పరిగెత్తింది.

"ఇదిగో - ఈ నెక్లెస పెట్టుకో. ఎలా వుంటుందో చూదాం"- పలుకులా అవి!!- అమృతపు చినుకులు.

అస్తగ్రాత్రి సూర్యుణ్ని చూసినంత ఆశ్చర్యంగా వుంది సావిత్రికి. నెక్లెస్ అందుకుని ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతూ ధరించి. భర్తముందు "క్రేస్"లో బొమ్మలా వంకర తిరిగి నిల్చుంది, చిరునవ్వు చిందిస్తూ. "భేష్ చాలా బావుంది" అన్నాడు సుబ్బారావు కళ్ళెగరేసి.

ఆ ఆనందంలో అలా చచ్చిపోతే చాలు ననిపించింది సావిత్రికి. భర్తలో యింతలో ఎంత మార్పు!! రేపు తన పుట్టిన రోజు. గుర్తుపెట్టుకు తెచ్చాడన్నమాట.. భర్త కళ్ళల్లోకి అనురాగంతో చూస్తూ. కళ్ళ నీళ్ళెట్టుకుంది సావిత్రి.

వెలిగే కళ్ళతో నవ్వులు చిందిస్తూ అన్నాడుకదా సుబ్బారావు- "మట్టిబొమ్మ లాంటిదానివి నా సేయ్- నువ్వెట్టుకుంటేనే యింత బాగుందే- ఇక అప్సరసలాంటి సుజాత పెట్టుకుంటే మరెంత బాగుంటుందో! అబ్బ! అయితే నా సెలక్షన్‌లో లోపం లేదన్నమాట. వెరీగుడ్! తీసి ఈ పెట్టెలో భద్రంగా పెట్టు. ఈ రోజు సుజాత బర్త్‌డే. ప్రెజెంట్ చేయాలి దీన్ని...."

-తులసి బాలకృష్ణ

## మన మెజీషియన్లు

### ప్రొఫెసర్ డి.ఎస్.ఎన్.రాజు. B.Com: AIMC

క్లోజప్ మెజీషియన్



మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిప్లమో పొంది. కామర్స్‌లో డిగ్రీపొంది. ప్రస్తుతం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్న రాజుగారికి "క్లోజప్ మెజీషియన్" అనే పేరుకూడా వుంది. అంటే స్టేజిమీదచేసే అంశాలకన్నా పదిమంది మధ్యలో కూర్చుని ప్రదర్శించే మేజిక్‌లు చేసే వ్యక్తి అన్నమాట. తాను ఇకముందు కూడా స్టేజిమీద ప్రదర్శన లియ్యననీ, అలాగ చేసే మెజీషియన్లు చాలామంది ఉన్నారని తాను కేవలం తన స్నేహితులు. బంధువుల సమక్షంలోనే ప్రదర్శిస్తానని అన్నారు.

భీమవరంసమీపంలోనికోపల్లె గ్రామానికి చెందిన రాజు. పేక ముక్కలతోనూ. అగ్గిపెట్టెతోనూ. చిన్న చిన్న పరికరాలతోనూ మాజిక్‌లుచేస్తూ అన్ని వయసుల ప్రేక్షకులను-ముఖ్యంగా చిన్నపిల్లలను వినోదింపచేయగలరు.

ఆంధ్రప్రదేశ్‌లో ఇంద్రజాల ప్రభంజనం బాగా వీస్తోందనీ. ఎందరో యువతీ యువకులు ఇంద్రజాలం నేర్చుకోడానికి ముందుకొస్తున్నారని, ఇది చాలా మంచి మార్పు అని భావిస్తున్నారు. ఆంధ్రజ్యోతి వారపత్రికలో "ఇంద్రజాలం" అనే శీర్షిక ద్వారా కొందరు అంతర్జాతీయ ఇంద్రజాలికులు రచించిన మాజిక్‌లను తెలుగులో అనువదించి రాస్తున్నారు

త్వరలోనే ఏదో ఒక జిల్లాను దత్తత చేసుకుని. ఆ జిల్లాలోని ఇంటింటికీ తిరిగి మేజిక్ చేయాలనే విచిత్ర నిర్ణయం తీసుకున్న రాజుగార్ని అభినందిస్తున్నాను.

చిరునామా : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. తాడేపల్లిగూడెం.

— బి. వి. పట్టాభిరాం
మెజీషియన్